అస్తవ్యస్తంగా డ్రెయినేజీ

- ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యం.. లేబర్‌కాలనీవాసులకు శాపం
- ఏళ్ల తరబడి కచ్చా డ్రెయినే దిక్కు
- అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మాణానికి మీనమేషాలు



లేబర్‌కాలనీలోని కచ్చా డ్రెయిన్

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యం లేబర్‌కాలనీవాసులకు శాపంగా మారింది. సైడు కాలువల్లోని మురుగు నీరు ముందుకు కదలక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలువలు నిండిపోయి ఇంటి వాకిట్లోకి వచ్చేసి రాకపోకలకు ఇబ్బందికరంగా ఉన్నా పట్టించుకునే నాథుడే లేడు. ఏళ్ల తరబడి ఉన్న కచ్చా డ్రెయిన్ స్థానంలో పక్కా అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మాణానికి మీనమేషాలు లెక్కిస్తున్న మున్సిపల్ అధికారులపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ముందుకు కదలని మురుగునీరు

విద్యాధరపురం 44వ డివిజన్ పరిధిలోని లేబర్ కాలనీలో గల ఆరు బిల్డింగ్‌ల ముందున్న సైడు కాలువలన్నీ నిండిపోయి ఉన్నాయి. అవి ముందుకు వెళ్లాలంటే అక్కడ ఉన్న వెడల్పాటి కచ్చా డ్రెయిన్‌లోని మురుగునీరు కదిలితేనే కాలువల్లోని నీళ్లు కదులుతాయి. ఆరు బిల్డింగ్‌ల ముందున్న మెయిన్ రోడ్డుపై బాక్స్ కల్వర్ట్‌కు సమాంతరంగా ఉన్న కచ్చా డ్రెయిన్‌లోని మురుగునీరు ఎక్కడికక్కడే నిలిచిపోవడంతోనే తమకీ అవస్థలని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ పరిస్థితి ఇలా ఉండగానే ఇటీవల సంభవించిన బుడమేరు వరద కారణంగా ఆరు బిల్డింగ్‌ల ప్రాంతం నడుంలోతు వరద నీటితో మునిగిపోయింది. వరద ఉధృతికి అయినా కచ్చా డ్రెయిన్‌లోని చెత్తాచెదారం, లోపల సిల్ట్ కొట్టుకుపోయి పరిస్థితులు చక్కబడతాయని ఆశించిన కాలనీవాసుల ఆశలు నిరాశగానే మిగిలిపోయాయి.

సుదీర్ఘ ప్రయాణం

కచ్చా డ్రెయిన్‌లోని మురుగు నీరు ముందుకు సాగుతూ కాలనీలోని జీఎస్‌ఆర్ మున్సిపల్ హైస్కూల్ వెనుక నుంచి ఏర్పాటు చేసిన సిమెంట్ పైపుల ద్వారా స్టేడియం స్థలం చివరి వరకు వెళ్లి అక్కడ ఉన్న అవుట్‌ఫాల్ డ్రెయిన్‌లోకి చేరాలి. అక్కడి నుంచి కుడివైపుగా వెళ్లి సితార జంక్షన్ మూల మీదున్న అవుట్‌ఫాల్ డ్రెయిన్ ద్వారా కబేళా రోడ్డులోని డ్రెయిన్‌లో కలవాల్సి ఉంటుంది. అయితే ఇంత సుదీర్ఘ ప్రయాణంలో మురుగునీటి పారుదలకు అనేక ఆటంకాలు ఎదురవుతున్నాయి.



ఒక ఇంటి ఆవరణలో చేరిన మురుగునీరు

సిమెంట్ చప్టాలే కారణం

బైపాస్ రోడ్డు పక్కన ఉన్న అవుట్‌ఫాల్ డ్రెయిన్‌పై వ్యాపారస్తులు భారీగా కట్టిన సిమెంట్ చప్టాలే అందుకు కారణభూతంగా నిలుస్తున్నాయి. వ్యాపారస్తులు నిర్మించిన చప్టాల మధ్యలో అక్కడక్కడ డ్రెయిన్ శుభ్రం చేసేందుకు జల్లెడ వంటి ఏర్పాట్లు చేసినప్పటికీ అవి నామమాత్రంగానే మిగిలిపోయాయి. చప్టాల కింద చెత్తాచెదారం పెద్ద ఎత్తున నిలిచిపోవడంతో మురుగునీటి పారుదల సక్రమంగా సాగడం లేదన్నది స్పష్టమవుతుంది. కాగా సైడు కాలువలు నిండిపోయి మురుగునీరు ఇంటి ఆవరణలోకి వచ్చేయడంతో ఆ ఇంటి యజమాని ఖాళీ చేసి కాలనీలోనే మరో ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



కాలనీలోని ఓ ఇంటి ముందుకు వచ్చిన మురుగునీరు



డ్రెయిన్ వద్ద నిలిచిపోయిన మురుగునీరు

విజిటింగ్ ప్రొఫెసర్‌గా ఎమ్మెల్యే

పశ్చిమ నియోజకవర్గాన్ని ఎవరూ ఊహించని రీతిలో అభివృద్ధి చేస్తానని ఎన్నికల ముందు ఊదరగొట్టిన ఎమ్మెల్యే గెలిచిన తర్వాత నియోకవర్గానికి విజిటింగ్ ప్రొఫెసర్‌గా తయారయ్యారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ చేసే సుజనాచౌదరికి పశ్చిమ నియోజకవర్గం ఒక గల్లీ లాంటిదని, అటువంటి ప్రాంతం అభివృద్ధిపై ఏం దృష్టి పెడతారని ప్రజలు ఎద్దేవా చేస్తున్నారు. నియోజకవర్గంలోని సమస్యలను ఆయన ఏమాత్రం పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే నియోజకవర్గంలో పర్యటిస్తే సమస్యలను చెప్పుకోవడానికి వీలు ఉంటుందని ప్రజలు వాపోతున్నారు. అంతేగానీ ఎమ్మెల్యే కార్యాలయం చుట్టూ తిరుగుతూ కార్యాలయ కార్యదర్శిని కలిసి చెప్పుకోవాల్సి వస్తే ఇంక ఎమ్మెల్యే ఎందుకని ప్రశ్నిస్తున్నారు.

క్లుప్తంగా

సృష్టిలో అమ్మను మించిన దైవం లేదు



భవానీపురం(విజయవాడపశ్చిమ): సృష్టిలో అమ్మను మించిన దైవం లేదని వైఎస్సార్ సీపీ 38వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ యూత్ సెక్రటరీ షేక్ ఇర్ఫాన్ ఆధ్వర్యంలో విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లో ఆదివారం మాతృ దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కార్పొరేటర్ రెహమతున్నీసా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమెకు మాతృ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నిస్వార్థమైన అమ్మ ప్రేమ అనిర్వచనీయమైనదని అన్నారు. ప్రతి బిడ్డకు అమ్మే సర్వస్వమని కావాలని ఆకాంక్షించారు. కనిపెంచిన అమ్మను కనిపెట్టుకుని ఉండాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. లోకంలో బిడ్డ పుట్టినప్పటి నుంచి పెరిగి ప్రయోజకుడయ్యే వరకు ప్రతిఫలం ఆశించకుండా సేవలు అందించేది ఒక్క మాతృమూర్తేనని పేర్కొన్నారు. అటువంటి తల్లి రుణం తీర్చుకోవడం అసాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ నాయకుడు షేక్ హయాత్ షరీఫ్, రాష్ట్ర మైనార్టీ సెల్ జాయింట్ సెక్రటరీ ఎస్‌కే నజీర్, రేవులగడ్డ విజయ్ తదితరులు పాల్గొని రెహమతున్నీసాకు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు వీఎంసీలో పీజీఆర్‌ఎస్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర ప్రజల ప్రతి సమస్యకు పరిష్కారం చేసేందుకు వీఎంసీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం (పీజీఆర్‌ఎస్) నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంతోపాటు చిట్టినగర్‌లో ఉన్న సర్కిల్–1 కార్యాలయం, సత్యనారాయణపురంలో ఉన్న సర్కిల్–2, పటమటలోని సర్కిల్–3 కార్యాలయాల్లోనూ నిర్వహిస్తామని పేర్కొన్నారు. జోనల్ కమిషనర్‌లు నగరవాసుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరిస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నిబద్ధత గల నేత ఉయ్యాల శ్రీనివాస్



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఎంసీపీఐ(యూ) కృష్ణాజిల్లా మాజీ కార్యదర్శి అమరజీవి కామ్రేడ్ ఉయ్యాల శ్రీనివాస్ నిబద్ధత కలిగిన నేత అని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఖాదర్‌బాషా పేర్కొన్నారు. ఉయ్యాల శ్రీనివాస్ నాలుగో వర్ధంతి కార్యక్రమాన్ని ఆ పార్టీ నగర కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. తొలుత శ్రీనివాస్ చిత్రపటానికి ఖాదర్ బాషా, బహుజన దళిత చైతన్య సంఘ్ నాయకుడు రాచపూడి బాబురావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎస్‌డీ సుభాని, ఎస్‌కే అజాజ్, ఎస్‌డీ వాహెద్, ఎస్‌కే తాజ్, ఎస్‌డీ ఖాలిద్, ఎస్‌కే మక్బుల్, అతిక్, అజ్జు తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు మాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఇంటి ముందు పార్క్ చేసిన బైక్‌లు కనిపించడం లేదంటూ భవానీపురం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. భవానీపురం శివాలయం సెంటర్‌కు చెందిన వుడత్ వెంకట శ్రీనివాసరావు సాయిరామ్ థియేటర్ వద్ద క్యాంటీన్ నిర్వహిస్తున్నాడు. గత నెల 25వ తేదీ రాత్రి క్యాంటీన్‌లో పని ముగించుకొని వచ్చి ఇంటి ముందు బైక్ పార్క్ చేశాడు. మరుసటి రోజు ఉదయం చూడగా బైక్ కనిపించలేదు. చుట్టు పక్కల వెతికినా బైక్ ఆచూకీ లభించలేదు. దీంతో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

కబేళా సెంటర్‌లో మరో బైక్

కబేళా సెంటర్‌కు చెందిన శివరామకృష్ణ వన్‌టౌన్‌లో గోల్డ్ స్మిత్ పనిచేస్తున్నాడు. ఈ నెల 6వ తేదీ రాత్రి పనులు ముగించుకొని బైక్‌పై ఇంటికి చేరుకొని ఇంటి ముందు పార్క్ చేశాడు. మరుసటి రోజు ఉదయం చూడగా బైక్ కనిపించలేదు. దీనిపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

భర్త వేధింపులపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మద్యం సేవించి భర్త వేధిస్తున్నాడంటూ మహిళ భవానీపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాలు.. ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్డుకు చెందిన గిరితూరి శివపార్వతికి 16 ఏళ్ల క్రితం గణేష్ అనే వ్యక్తితో వివాహం అయింది. వీరికి ఇద్దరు సంతానం. గణేష్ ఆటో డ్రైవర్. ప్రతినిత్యం మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. అధిక కట్నం తేవాలంటూ ఇబ్బందులు పెడుతున్నాడు. దీంతో భవానీపురం స్వాతిరోడ్డులో ఉంటున్న వాళ్ల అక్క ఇంటికి వెళ్లగా అక్కడికి కూడా వెళ్లి ఆమెను కొట్టాడు. వేధింపులు భరించలేని శివపార్వతి తన భర్తపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన శ్రీ కనకదుర్గ నృత్య మందిర్ చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. ఆదివారం సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట కళావేదికపై సాయి సహస్ర పర్యవేక్షణలో 20 మందికి పైగా చిన్నారులు పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం కళావేదిక వద్దకు చేరుకున్న భక్తులు చిన్నారుల నృత్య ప్రదర్శనను వీక్షించి వారిని అభినందించారు. నృత్య ప్రదర్శన అనంతరం ఆలయ అధికారులు శిష్యబృందానికి అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలు అందజేశారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ హెచ్చరించారు. ఆదివారం స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. షీటర్లపై పోలీసుల నిరంతర నిఘా ఉంటుందని పేర్కొన్నారు. మంచి ప్రవర్తన కలిగి ఉండి కుటుంబసభ్యులతో సంతోషంగా జీవించాలని సూచించారు. చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడినట్లు తమ దృష్టికి వస్తే ఎట్టి పరిస్థితిలో ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావంగా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వాకర్స్, చిన్నారులు, యువత

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావంగా ఆదివారం కేఎల్‌రావు పార్కు నుంచి పలు అసోసియేషన్ల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అబ్దుల్ కలాం వాకర్స్ అసోసియేషన్, కేఎల్‌రావు పార్కు హ్యాపీ వాకర్స్ అసోసియేషన్, కేఎల్‌రావు పార్క్ బ్యాడ్మింటన్ అండ్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున వాకర్స్ ర్యాలీలో పాల్గొన్నారు. పార్కు వద్ద ప్రారంభమైన ర్యాలీని ఉద్దేశించి అసోసియేషన్ల అధ్యక్షులు బీఎస్‌కే పట్నాయక్, వేశపోగు ఆల్ఫ్రెడ్, జీ రామకృష్ణారావు ప్రసంగించారు. పాకిస్తాన్ ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసిన మన సైనికులకు దేశ ప్రజలందరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఆపరేషన్ సిందూర్‌లో కీలక పాత్ర పోషించిన ఇద్దరు మహిళా జవాన్లకు దేశప్రజలందరి తరపున అభినందనలు తెలుపుతున్నామని చెప్పారు. దేశం కోసం అందరం కలిసిమెలిసి పని చేయాలని ఇటువంటి విపత్తు పరిస్థితుల్లో సైనికులతో కలిసి పని చేసేందుకు యువత ముందుకు రావాలని కోరారు. కేఎల్ రావు పార్కు నుంచి ప్రారంభమైన ర్యాలీ వీఎంసీ కాలనీ, కేటీ రోడ్డు, కలరా హాస్పటల్ మీదుగా సాగింది. ర్యాలీలో భారత్ మాతాకీ జై.. అంటూ చిన్నారులు, యువత నినాదాలు చేశారు. కార్యక్రమంలో జగుపిళ్ల శ్రీనివాసరావు, బీరం శ్రీనివాసరావు, బెల్లం వెంకటేశ్వరరావు, ఎం. ప్రసాద్, సుబ్బారావు, మదన్‌మోహన్, రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి విడదల రజనీపై పోలీసుల తీరు దారుణం

వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు పోతిన మహేష్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మాజీ మంత్రి విడదల రజనీపై పోలీసులు చేసిన దౌర్జన్యం అత్యంత పాశవికమని, కూటమి ప్రభుత్వంలో మహిళలకు భద్రత కరువైందని వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు పోతిన మహేష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యావత్తు దేశం పాకిస్తాన్‌తో మన సైన్యం చేస్తున్న యుద్ధం గురించి ఆలోచిస్తూ వారికి మద్దతుగా కార్యక్రమాలు చేస్తుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రం ప్రతిపక్షాలపై పగ, ప్రతీకార చర్యలతో దారుణంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి, బీసీ మహిళపై పోలీసులతో ప్రభుత్వం చేసిన ఈ దాడిని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. రజనీ పీఏ శ్రీకాంత్ ఏమి చేశాడు. ఏ కేసు పెట్టారని ప్రశ్నిస్తే ఆమెపై దౌర్జన్యం చేస్తూ అరెస్ట్ చేయడం ఏమిటని మండిపడ్డారు. ఫిర్యాదు చేసిన అరగంటకే కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయకుండా అరెస్ట్ కోసం రోడ్డుపై అడ్డుపడటం చూస్తే పోలీసుల తప్పుడు తీరు అందరికీ అర్థమవుతోందని అన్నారు.

ప్రజాసమస్యలను గాలికొదిలేసిన ప్రభుత్వం

ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు, రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేయాలని చూస్తున్న ప్రభుత్వ దమననీతిపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గరపడ్డాయని హెచ్చరించారు. సోషల్ మీడియా యాక్టివిస్టులపై కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు అమానవీయంగా ఉందన్నారు. మహిళల పట్ల ఈ ప్రభుత్వం అనుసరిస్తున్న దిగజారుడు విధానాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఏ ప్రభుత్వమైనా చట్టం ప్రకారం నడుచుకోవాలన్నారు. రాష్ట్రంలో అనేక సమస్యలు వెంటాడుతుంటే వాటిని గాలికొదిలేసి ప్రతిపక్షాలపై పగ తీర్చుకోవడమే పనిగా ప్రభుత్వం పని చేస్తోందని మండిపడ్డారు. రానున్న కాలంలో ప్రజలు తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

విద్యార్థులు సమయపాలన అలవర్చుకోవాలి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): చిత్తరంజన్‌శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో ఆదివారం ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ వైద్యుడు డాక్టర్ ఎం.జగన్ మోహన్‌రావు పాల్గొని విద్యార్థులకు పలు అంశాలపై బోధనలు చేశారు.

మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు తల్లి పాత్ర విశిష్టతను వివరించారు. విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలంటే చదువు ఒక్కటే సరిపోదన్నారు. సమయపాలన, వ్యక్తిత్వ వికాసం ఎంతో ముఖ్యమన్నారు. ప్రతిఒక్కరూ సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం విద్యార్థి దశ నుంచే నేర్చుకోవాలని సూచించారు. మైండ్ మ్యాపింగ్ అనేది ఆలోచనలు, సమాచారాన్ని నిర్వహించడానికి ఉపయోగించే ఒక దృశ్య గమనిక అని పేర్కొన్నారు. దీని ద్వారా విద్యార్థులు పరీక్షల్లో అత్యున్నత మార్కులు సాధించగలరని వెల్లడించారు. కార్యక్రమంలో పాల్గొన్న రైల్వే రిటైర్డ్ చీఫ్ ఆఫీస్ సూపరింటెండెంట్ కె.శేషబాల భగవద్గీత శ్లోకాలు, ప్రభాస్ కాలేజ్ లెక్చరర్ ఈవీ ప్రేమ్ కుమార్ జనరల్ నాలెడ్జ్, రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ వి.సాయి సుబ్బన్న మ్యాథమెటిక్స్, రిటైర్డ్ లెక్చరర్ బి.సావిత్రి తెలుగు సబ్జెక్టులను బోధించారు. కార్యక్రమంలో గ్రాంథాలయ అధికారి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత సేవలన్నా వినిపించుకోరే..!



ఓం టర్నింగ్ వద్ద కౌంటర్ బయట పరిస్థితి



క్యూలైన్లు ప్రారంభమయ్యే ప్రదేశంలో ఇలా..



పొంగలి షెడ్డు వద్ద వదిలేసిన చెప్పులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): భక్తులు, యాత్రికులు తమ చెప్పులను భద్రపరుచుకునేందుకు దేవస్థానం ఉచిత కౌంటర్లు ఏర్పాటు చేసింది. మహామండపంతో పాటు ఘాట్‌రోడ్డులోని ఓం టర్నింగ్ వద్ద దేవస్థాన సిబ్బంది చెప్పుల కౌంటర్లలో విధులు నిర్వహిస్తున్నారు. అయితే భక్తులు మాత్రం తమ చెప్పులను కౌంటర్లలో కాకుండా ఆలయ ప్రాంగణంలోని ద్విచక్ర వాహనాల పక్కన, భక్తులు కూర్చునే ప్రదేశాల్లో విడిచి పెడుతున్నారు. దీంతో

కౌంటర్ బయటే భక్తుల చెప్పులు

ఆధ్యాత్మిక కేంద్రమైన దుర్గగుడి పరిసరాలన్నీ చెప్పులతో నిండిపోతున్నాయి. ఘాట్‌రోడ్డులోని కౌంటర్ ఎదుట ఇదే ఉచిత చెప్పుల స్టాండ్ అని ఏర్పాటు చేసిన బోర్డు చుట్టూ వందలాది చెప్పుల జతలే కనిపిస్తున్నాయి. ఆలయ పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు శానిటేషన్ సిబ్బంది ఆ చెప్పులను తొలగిస్తుంటే భక్తులు వారితో వాగ్వాదం చేస్తున్నారు. మరోవైపు చెప్పుల దొంగలు ఇదే మంచి అవకాశం అని వారికి నచ్చిన, అధిక ధర ఉండే చెప్పులను దర్జాగా వేసుకెళుతున్నారు. అసలు ఉచితంగా నిర్వహించే కౌంటర్లలో తమ చెప్పులు భద్రపరుచుకునేందుకు భక్తులు ఎందుకు ఆసక్తి చూపడం లేదో అర్థం కాని పరిస్థితి. ఆలయ అధికారులు ఇకనైనా ఈ సమస్యకు పరిష్కారం చూపాలని యాత్రికులు కోరుతున్నారు.

బాటసారులకు మజ్జిగ పంపిణీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): పాదచారులు, బాటసారుల దాహార్తి తీర్చేందుకు దాతలు మజ్జిగ పంపిణీ చేశారు. చిట్టినగర్ 47వ డివిజన్ పరిధిలో వైఎస్సార్ సీపీ ఎస్సీ రాష్ట్ర నాయకుడు కామ్మళ్ల జోజి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రముఖ వ్యాపారవేత్త చింతలపూడి సత్యనారాయణ పాల్గొని మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కట్ట ఆంజనేయులు, దాసరి ఏసు, కామ్మళ్ల కిషోర్, చెవుల శ్రీనివాస్, పావులూరు శివాజీ, టీ అలీమ్, హరి, పిళ్లాసాయి, పలతోటి జోషి, పీ ఏసుబాబు, పీ సతీష్, జే కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే విద్యాధరపురం కబేళా సెంటర్‌లో వెంకట్ మహేశ్వర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. గత ఏడేళ్లుగా దాతల సహకారంతో ప్రతి ఏడాది మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ ముత్తంశెట్టి దుర్గా కిషోర్ తెలిపారు. బాడిత శంకర్, గోవింద లక్ష్మి, దాత తెలుగుంట్ల రాజా, ట్రస్ట్ సెక్రటరీ విజయలక్ష్మి, ముఖ్య సేవా సభ్యులు రాజేష్, లక్ష్మీశ్రీనివాస్ పాల్గొన్నారు.



శాస్త్రోక్తంగా నృసింహ జయంతి వేడుకలు



కోదండ రామాలయంలో నరసింహునికి చందనోత్సవం



పాతశివాలయంలో నరసింహస్వామికి విశేష పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గంలో నృసింహ జయంతి వేడుకలను ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వైష్ణవాలయాలతో పాటుగా ప్రముఖ ఆలయాల్లోని నృసింహ ఉపాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విశేష వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కోదండ రామాలయంలో...

పాతబస్తీ కొత్తగుళ్ల ప్రాంగణంలోని శ్రీ కోదండ రామాలయంలో నృసింహ జయంతిని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆదిలక్ష్మి సమేత నరసింహ స్వామివారి ఉత్సవమూర్తులకు ఉదయం పంచామృత తిరుమంజనం జరిగింది. పంచామృతాలతో పాటుగా వివిధ సుగంధ ద్రవ్యాలతో స్వామివారిని అభిషేకించారు. ఈ సందర్భంగా విశేష అలంకారం చేశారు. అనంతరం స్వామివారికి సహస్రనామార్చన, చందనోత్సవాన్ని నిర్వహించారు. అదేవిధంగా ఆదిలక్ష్మి అమ్మవారికి స్వామివారికి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ అర్చకస్వాములు పులిపాక ఆంజనేయాచార్యులు, రాఘవాచార్యులు నిర్వహించారు.

పాతశివాలయంలో...

నగరంలోని పురాతన ఆలయమైన శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామివారి ఆలయంలో నృసింహ జయంతిని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీ నరసింహస్వామివారి ఉపాలయంలో స్వామివారికి తిరుమంజన అభిషేకాన్ని జరిపారు. అనంతరం సహస్రనామార్చన జరిగింది. కార్యక్రమాలను వేణుగోపాలాచార్యులు నిర్వహించారు.







సుర్రుమన్న సూరీడు

భానుడి దెబ్బకు జనం బెంబేలెత్తుతున్నారు. ఆదివారం 40 డిగ్రీలు పైనే ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం ఏడు గంటల నుంచే ఎండ ప్రభావం చూపింది. వివిధ పనుల నిమిత్తం బయటకు వచ్చిన ప్రజలు పది గంటల కల్లా ఇళ్లకు చేరుకున్నారు. జన సంచారం లేక కొన్ని రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. ఎండ దెబ్బ తగలకుండా ద్విచక్రవాహనాలపై ప్రయాణించే వాళ్లు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ముఖాలు పూర్తిగా కప్పేసుకొని వాహనాలపై వెళ్తున్న చిత్రాలివి.

సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ